

బాల్కొండలో నిర్వహించిన ర్యాలీలో నృత్యం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



వేల్పూర్‌లో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

కమ్మర్‌పల్లి/వేల్పూర్/బాల్కొండ/మెండోరా/మోర్తాడ్/ఏర్గట్ల/భీమ్‌గల్/ముప్కాల్, డిసెంబర్ 3: బాల్కొండ ఎమ్మెల్యేగా వేముల ప్రశాంత్‌రెడ్డి మూడోసారి గెలుపొందడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆయన స్వగ్రామం వేల్పూర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పటాకులు కాలుస్తూ స్వీట్లు తినిపించుకున్నారు. కమ్మర్‌పల్లి, వేల్పూర్, బాల్కొండ, మెండోరా, మోర్తాడ్, భీమ్‌గల్, ఏర్గట్ల, ముప్కాల్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. పటాకులు కాల్చి స్వీట్లు పంచుతూ ప్రశాంత్‌రెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.



భీమ్‌గల్‌లో పటాకులు కాలుస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



సుంకెట్‌లో పటాకులు కాల్చి సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

# ఆర్మూర్ ఎమ్మెల్యేగా పైడి రాకేశ్ రెడ్డి

- 29,670 ఓట్ల మెజారిటీతో గెలుపు

నందిపేట్, డిసెంబర్3: ఆర్మూర్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి అంకాపూర్ గ్రామానికి చెందిన వ్యాపారవేత్త పైడి రాకేశ్‌రెడ్డి విజయం సాధించారు. ఆదివారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో 29,670 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఒక్క 14వ రౌండ్ మినహా మిగతా అన్ని రౌండ్లలో ఆధిక్యం వచ్చింది. ప్రధానంగా ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలవగా కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డిపై 29,670 ఓట్ల మెజారిటీతో రాకేశ్‌రెడ్డిపై చేయి సాధించారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగింది. 217 పోలింగ్ బూత్‌లకు గాను 13 మంది అభ్యర్థులు బరిలో నిలవగా 1,59,804 ఓట్లు పోలయ్యాయి. ఇందుకు గాను అధికారులు 16 రౌండ్లను 14 టేబుళ్లతో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఇందులో మొదటి రౌండ్ నుంచి బీజేపీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ఆధిక్యంలో కొనసాగారు. ఇందులో బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డికి 39,393 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌కుమార్‌రెడ్డి కి 42,984 ఓట్లు, బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డికి 72,654 ఓట్లు వచ్చాయి. గెలుపొందిన పైడి రాకేశ్ రెడ్డికి అధికారులు గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

**నిధులు సమానంగా తీసుకువస్తా**

ప్రభుత్వంలో ఎవరు ఉన్నా ఆర్మూర్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు రావాలో అన్ని తప్పకుండా తీసుకువస్తానని పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు.



ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పైడి రాకేశ్‌రెడ్డి

గెలుపొందిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వంలో ఎవరున్నా, సీఎంగా ఎవరున్నా సీఎం తన నియోజకవర్గానికి ఎన్ని నిధులు తీసుకువెళ్తారో అన్ని నిధులు ఆర్మూర్ నియోజకవర్గానికి ఇవ్వాల్సిందేనని అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గానికి వాటాగా ఎంత నిధులు రావాలో అన్ని నిధులు తప్పకుండా తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని అన్నారు. సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో ఆర్మూర్ ప్రజల గొంతుగా వినిపిస్తానని, అవినీతిని ప్రోత్సహించేదిలేదని, నిజాయితీతో కూడిన పాలన అందిస్తానని ఆయన అన్నారు.

# బోధన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం

- బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌పై 3,062 ఓట్ల మెజార్టీతో సుదర్శన్‌రెడ్డి గెలుపు
- మూడో స్థానానికే పరిమితమైన బీజేపీ

బోధన్, డిసెంబర్ 2: స్థానిక ఎమ్మెల్యేగా అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి విజయం సాధించారు. ఆదివారం నిజామాబాద్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఓట్ల లెక్కింపులో ఆయన తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌పై 3,062 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి 66,901 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌కు 63,963 ఓట్లు, బీజేపీ అభ్యర్థి వడ్డీ మోహన్‌రెడ్డికి 33,555 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌తో కలుపుకుని మొత్తం 1,72,202 ఓట్లు పోలయ్యాయి. వీటిలో పోస్టల్ ఓట్లను ప్రత్యేకంగా లెక్కించగా, మిగతా ఈవీఏంల ఓట్లను మొత్తం 18 రౌండ్లలో లెక్కించారు. మొత్తం ఓట్లలో పోస్టల్ ఓట్లు 1401 ఓట్లు.. ఈవీఎంల ఓట్లు 1,70,801ఓట్లు. ఈ ఎన్నికల్లో బీజేపీ మూడో స్థానానికే పరిమితమైంది.

**మిగతా అభ్యర్థుల ఓట్ల వివరాలు ఇలా**

బీఎస్పీ అభ్యర్థి ముమ్మలనేని అమర్‌నాథ్‌బాబుకు 1,425 ఓట్లు, ఏఐఎఫ్‌బీ అభ్యర్థి డి.నాగరాజుకు 663 ఓట్లు, డీఎస్పీ పార్టీ అభ్యర్థి మురళీ సాయంకు 171 ఓట్లు, ఎంకేపీఐ పార్టీ అభ్యర్థి మోసీన్‌కు 481 ఓట్లు, పిరమిడ్ పార్టీ అభ్యర్థి రజితావాణికి 123 ఓట్లు, ఇతర పార్టీల అభ్యర్థులు షర్జీల్ ఫర్వేజ్‌కు 202 ఓట్లు, హన్మాన్‌జీ భూపాల్‌రెడ్డికి 1591 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థులు జునైద్ అహ్మద్ ఖలీల్‌కు 303 ఓట్లు, షేక్ జలీల్‌కు 520 ఓట్లు, సయ్యద్ అస్గర్‌కు 636 ఓట్లు, సుదర్శన్‌రాజ్‌కు 523 ఓట్లు వచ్చాయి.

**నోటాకు 872 ఓట్లు**

బోధన్ నియోజకవర్గంలోని ఓటర్లు 872 మంది 'నోటా'కు ఓటేశారు. పోస్టల్ బ్యాలెట్‌లో ఓట్లు 1401 కాగా, ఇందులో కాంగ్రెస్‌కు 530 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థికి 237 ఓట్లు, బీజేపీ అభ్యర్థికి 321 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థి ఎం.అమర్‌నాథ్‌బాబుకు 18 ఓట్లు రాగా, మిగిలిన ఓట్లు ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులకు వచ్చాయి.




పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

## పోలీసుల కవాతు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్3: పట్టణంలో ఆదివారం పోలీసులు కవాతు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాల మేరకు కవాతు నిర్వహించినట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు తెలిపారు. పట్టణంలోని గోల్‌బంగ్లా నుంచి మామిడిపల్లి చౌరస్తా వరకు పోలీసులు కవాతు నిర్వహించారు.

# తీరు మార్చుకోని ఆటోవాలాలు

- బస్టాండుకు అడ్డంగా ఆటోలు నిలుపుతున్న వైనం
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

శక్కర్‌నగర్, డిసెంబర్ 3: బోధన్ బస్టాండ్ ప్రాంతంలో ఆటోవాలాల తీరు మారడం లేదు.. బస్టాండ్‌కు వెళ్లే రహదారిపై ఆటోలను అడ్డంగా నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులను ఎవరైనా వారి బంధువులు ద్విచక్ర వాహనాలపై బస్టాండ్‌లో వదలాలంటే ఇబ్బందికరంగా మారింది. బస్టాండ్‌లోకి బస్సులు రాగానే, ప్రయాణికులు దిగుతుండగానే నేరుగా బస్టాండ్‌లోకి ఆటోలు వస్తున్నాయి. చాలా కాలం నుంచి ఆటోల నియంత్రణకు ఆర్టీసీ అధికారులు, పోలీసులు పలు చర్యలు చేపట్టారు. ఆర్టీసీ వారు ఆటోలను లోనికి రాకుండా నియంత్రించేందుకు ఓ అధికారిని నియమించారు. సదరు అధికారి, ఉద్యోగి చిన్నపాటి పనికోసం, లేదా భోజనానికి వెళ్లగానే ఆటోలు నేరుగా బస్టాండ్‌లోకి వస్తున్నాయి. పోలీసులు సైతం గతంలో కేసులు నమోదు చేస్తామని, ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా ఆటోలు నడుపుకోవాలని కౌన్సిలింగ్ నిర్వహించారు. అయినా, కొందరు ఆటోవాలాల తీరు మారడం లేదు. ఆటోను బస్టాండుకు అడ్డంగా ఎందుకు నిలిపావని ఎవరైనా అడిగితే వారితో ఆటోవాలాలు వాగ్వాదానికి దిగడం పరిపాటిగా మారింది. అధికారులు స్పందించి బస్టాండ్‌లోకి ఆటోలు రాకుండా నియంత్రించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బోధన్ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల ఎదుట నిలిపిన ఆటోలు